# నాకు తెలిసిన కథ

★

శ్రీ ఆదివిష్ణు

వాచీ చూచుకున్నాను. పన్నెండున్నరయింది.

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. ఈ రోడ్డు చూడటానికి చాలా అందంగా ఉంది. నిలబడ్డ చోటునుంచి ఎడంపక్కన ఒక మైలు కుడివక్కన ఒకమైలు పొడుగునా రోడ్డు స్పష్టంగా కనుపిస్తోంది. అక్కడక్కడ చిన్నచిన్న గుంటలు లేకుండా ఉంటే ఆ తారురోడ్డు ఇంకా అందంగా ఉండేది. రోడ్డు పక్కగా ఫర్లాంగుకి ఒక్కటి చొప్పున పెద్దపెద్ద చెట్లు తప్పించి నీడలిచ్చే చల్లని చోటు చెప్పుకునేందుకేమీ లేదు.

చాలా దూరంగా ఉన్న పొలాల నుండి వచ్చే చిన్నసైజు రణగొణధ్వని మినహాయించి మరింకో శబ్దం వినిపించడంలేదు. ఎండ తీక్షణంగా ఉంది. మేనెల ఎండలు ఈ ప్రాంతంలో దారుణంగానే ఉంటాయిట. ఆగిఆగి వచ్చే వర్షంకంటే తీవ్రమైన ఎండపట్ల ఒక విధమైన అభిమానంగల నాకూ ఈ ఎండని చూస్తూంటె చిరాకు కలుగుతోంది. చేతిలో ఉన్న జేబురుమాలు బాగా తడిసిపోయింది. ఇలాంటప్పుడు టర్కీటవలు వెంట ఉంటే ఎంత బాగుండేదోగదా.

బస్సు వచ్చేజాడ కనిపించడంలేదు. అక్కడికి దగ్గర్లో ఉన్న స్టేషన్లో రైలుదిగి మట్టిరోడ్డు వెంటనడిచి ఈ రోడ్డు చేరుకుంటూండగానే ఒక బస్సు రావడం గూడా జరిగింది. మరో బస్సు రావడానికి ఎంతసేపు పడుతుందో ఏమిటోగదా ఖర్మం.

ఈ రోడ్డుగానీ, దగ్గర్లో ఉన్న రైలుస్టేషనుగానీ, నేను వెళ్ళబోయే ఊరుగానీ నాకింతకు మునుపు తెలీవు. అంత అవసరమొస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. రెండు రోజుల క్రితం కేంప్‌నుంచి అద్దెగదికొచ్చేను. గదిలో రాజేశ్వరి రాసిన ఉత్తరం కనిపించింది. అది గదిని చేరుకుని అప్పటికే వారం రోజులై ఉంటుంది. కేంప్‌లో ఉంటడంవల్ల నాకు తెలిసింది కాదు. లేకపోతే వారం రోజుల క్రితమే, బిక్కుబిక్కుమనే ఈ రోడ్డుమీద ఇలాగే నిలబడి ఉండేవాడిని.

రాజీ ఉత్తరాలకీ, రాజీమాటకీ విలువ ఉంది. రాజీ నాకు దూరమైనా, నాపట్ల ఆమెకు అలక్ష్యభావ మేర్పడినా ఆమెను గౌరవించడంలో నాలోపమెన్నడూలేదు.

ఆమె దేనికీ, ఎప్పుడు భయపడలేదు. భయపడదు. అలాటిరాజీని ఒక్కసారిగా పిరికితనం ఆవరించింది. ఈ ఉత్తరంలో తన పిరికితనాన్నంతా వ్రాసుకుంది. ఆమె వ్రాసిన ఉత్తరం చదివి కలత చెందడం ఇదే మొదటిసారి.

—సరిపోయేంత నీడనిచ్చే ఈ చెట్టు లేకపోతే ఇంకెంత ఇబ్బంది పడిపోయేవాడినో. దిగులూ, కాస్త భయంకూడా కలిగేవి. ఎండ నిప్పులు చెరుగుతోంది. వయస్సులో ఉన్న నేనే ఈ ఎండకి ఇంత తల్లడిల్లి పోతున్నానుగదా, అదే ఎండలో వయస్సు మళ్లిన మనిషెవరైనా నా స్థితిలో ఉంటే ?

నేనేనాడూ ఈ ఎండలూ, వడగాల్పులూ వగైరాల గురించి పట్టించుకోలేదు. అథవా ఆ విషయాలెవరైనా నా దగ్గర తీసుకొస్తే చెవొగ్గి వినేవాడినీకాదు. ఎండల గురించి గొప్పగా చెప్పుకునే వాళ్లమాటమీద నాకు విశ్వాసం లేకపోగా చులకన భావమూ కలిగేది. అలాటిది నేనీనాడు అనుభవిస్తోన్న శ్రమని గమనిస్తూంటే నాపైనాకే జాలికలిగింది. నవ్వుకున్నాను.

జేబులోంచి సిగరెట్టు తీసి ముట్టించేను. ఒక పర్యాయం రోడ్డువైపు చూసేను. ఎక్కడా బస్సువచ్చే జాడ కనుపించడంలేదు. చెట్టు మొదట్లో చోటుచేసుకుని కూర్చున్నాను.

వాళ్ల ఊరుకెలా చేరుకోవాలో ఉత్తరంలో విపులంగా వ్రాసింది రాజీ. మా ఊరునుంచి పదిమైళ్ల బస్సుమీదొచ్చి అక్కడ రైలెక్కి దాదాపు ఏభై మైళ్ల ప్రయాణంచేసి ఇక్కడదిగి, మళ్లా ఇక్కడ్నుంచి పాతిక చిల్లరమైళ్ల రాబోయే బస్సుమీద వెళ్లాలిట. మరీ చిన్న పిల్లాడికి చెప్పినట్టు ఈ వివరాలన్నీ దేనికనలూ అని మొదట్లో అనుకున్నాను గానీ, ఈ ప్రయాణంలో ముఖ్యంగా ఇక్కడ ఇంత అవస్థపడాలని తెలుస్తే అలా కొట్టిపారేసే వాడినికాదు.

మా ఊర్లో కాఫీ తాగి తెల్లవారుఝామునే బయులుదేరాను. ఆ కాఫీనీళ్లు తప్పించి దార్లో మరేమీ పుచ్చుకోనే లేదు. ఇప్పుడు తెలుస్తుంది. ఆకలిబాధ ! ఎన్ని సిగరెట్లు కాలుస్తే మాత్రం ఏంలాభం ?

వెంటనే మరో భయంకరమైన ఆలోచన తట్టింది. ఇలా సిగరెట్టు మీద సిగరెట్టు తగలేస్తే, మిగిలున్న రెండు సిగరెట్లూ అయిపోడానికి సరిగ్గా పదినిముషాలు పట్టదు. అవి కాస్తా గల్లంతైన మీదట, కొనుక్కుందామనుకున్నా ఈ అడవిలో ఎవరమ్ముతారు. ఈ ఆలోచనరాగానే, కాల్చే సిగరెట్టుని కాస్త తాపీగా కాల్చడం ప్రారంభించేను.

—పాపం.. రాజేశ్వరి అక్కడెంత భయపడుతున్నదో గదా.. చిన్న విషయాలని భూతద్దంలోంచి చూడటం రాజేశ్వరి కిష్టం లేదని నాకు తెలుసు. అలాటిది, నన్ను వెంటనే ఉన్నపళంగా వచ్చేయమని రాసిందంటే అక్కడ పరిస్థితి ఎలా గుందోగదా.

భాస్కరాన్ని ఒక్కసారే చూశాను. అయితే మాత్రం— మరిచిపోలేని మనిషి. రాజీ పెళ్లయిన కొత్తలో ఇద్దరూ మదరాసు వెడుతూ ఒకరాత్రి భవదీయుడి ఆతిధ్యంపొందారు. అతన్ని పరిచయం చేసింది రాజీ. వాళ్లిద్దరూ నాతోగడిపిన ఆకొద్ది గంటలూ మరో జన్మలో కూడా గుర్తుంటాయనడంలో అతిశయోక్తి లేదు.

అతని భావాలలాగానే భాస్కరం చాలా అందమైన మనిషి. అన్ని విధాల రాజీకి తగిన భర్త. అదృష్టం పండిందని అప్పుడు అనుకున్నాను. లేకుంటె అతడెక్కడ ? నేనెక్కడ ? అతి సాధారణమైన నాలాటి గుమాస్తా బ్రతుక్కి రాజీ భాగస్వామిని అయితే— ఆమె అనుభవిస్తా సుఖశాంతులేమయ్యేది.

ఇంకా నయం— మేమిద్దరం కలిసి తిరుగుతున్న రోజుల్లో 'నిన్ను ప్రేమించాను రాజీ' అని కవిత్వం చెప్పానుగాదు. చెప్పినా ఆ పిల్లకాదనే మాట నిజం. ఆ పైన భాస్కరాన్ని పెళ్లాడి 'చూశావా సోదరా! ఇంత భాగ్యాన్ని వదలి నిన్ను పెళ్లాడతా అని నీకు మాటిస్తే నాగతేమయ్యేది' అని నా మొహం ముందే అనేసి ఉండేది.

నా అంత పిరికివాడూ, మొహ మాటస్థుడూ, బిడియస్థుడూ మరొహడు ఉండడు. ఒక విధంగా ఈ సుగుణాలే ఆమె ప్రయోగించబోయే వాడియైన బాణాల్లాంటి మాటల నుంచి నన్ను తప్పించాయని గూడా చెప్పుకోవచ్చు.

రాజీ నేనూ ఒకే ఊళ్లో పుట్టాము. అక్కడే పెరిగి పెద్దవాళ్లయ్యాము. మా రెండిళ్లూ పక్కపక్కనే ఉండేవి. రాజీ వాళ్లనాన్న రాజకీయాల్లో తిరిగి, జైళ్లకెళ్లి ఇప్పుడు ఒకానొక ప్రముఖ రాజకీయ వేత్తగా స్థిరపడ్డారు. వాళ్లకున్న మేడలాటి హోదా రోజురోజుకీ పెరిగిపోవడం నిజంగా వాళ్ల అదృష్టమే. అలాటి వాళ్లకి నేనెంత ? అందుకనే, నోరువిప్పి నా మనసులోని మాట రాజీతో చెప్పలేదు.

ఒక పెద్ద గండం రాజీకి నానుంచే తప్పింది.

తీవ్రమైన ఎండలో నడిరోడ్డుమీద నిలబడ్డ నాలాటివాడు జరిగిన కథ నెమరు వేసుకోడానికి తగిన కారణం లేకపోలేదు. ఏమీ తోచనివాడు గోళ్లు గిల్లుకుంటూ పాత విషయాలు గుర్తుచేసుకుంటూన్నాడంటే ఆశ్చర్యపడ నవసరం లేదు. పైగా— రాజీ రాసిన ఈ ఉత్తరం ఒకటి, గడిచిన కథని యావత్తు కదిలిస్తుంది.

ఏడాదిన్నర క్రితం సంక్రాంతికి సెలవుపెట్టి మా ఊరు వెళ్లాను. రాజీ పుట్టింటికి వచ్చిందని తెలిసింది. ఆ సాయంత్రం వీలు చేసుకుని ఆమెను పలుకరించడానికి వెళ్లాను. అప్పుడు రాజీ చాలా కొద్దిసేపు మాత్రమే మాటాడింది. అవుతే ఆ మాటల వెనక— ఆమె మనసులో ఏదో దాచుకున్నట్టు కనపించింది. ఆమె మొహంలో ఏదో వెలితి, ఆమె మాటల్లో ఏదో నిరుత్సాహం పసిగట్టాను. ఏమైనా రాజీ మునుపటి రాజీలా లేదు. ఆ మార్పుకి కారణమేమిటో నాకై నేను అడగాలనిపించ లేదు. వెంటనే తిరిగి ఇంటి కొచ్చేను.

భోజనాల దగ్గర చెల్లి చెప్పింది. రాజీకీ వాళ్లాయనకీ ఏవో భేదాభిప్రాయాలు వచ్చేయిట. అతనితో పోట్లాడి పుట్టింటికి వచ్చేసిందట. మళ్లా తిరిగి ఆ ఇంటికి వెళ్లనని మంకుపట్టుపట్టి కూర్చుందిట.

అదిరిపోయాను.

మంచి మనుషులు చాలా కొద్దిమంది ఉంటారు. వాళ్ల మంచితనం ఒక పట్టాన పూర్తిగా బోధపడదు. నిజమే నేమో. కాకుంటె, భాస్కరంలో ఇంత ఊహించరాని పొరపాట్లే ముంటాయి ? అతను భార్యని ఆదరించలేనంత మూర్ఖుడా! నేను నమ్మలేక పోయాను.

ఆఫీసు కెళ్లాల్సిన క్రితంరోజు రాజీ కబురుపెట్టింది. వెళ్లాను. కాఫీ ఇచ్చింది. తాగేను. వెళ్లిపోతున్నావటగా అన్నది. అవునన్నాను. మళ్లీ ఎన్నాళ్లకి కలుసుకుంటామో నన్నది. నవ్వి ఊరుకున్నాను. ఏమి మాటాడాలో రాజీక్కూడా తోచింది కాదేమొ నన్ను. ఖబుర్లు చెప్పమన్నది. నేనేం చెప్పలేదు.

కాసేపటికి నేనడక్కుండానే భాస్కరం గురించి చాలా చెప్పింది. విన్న తర్వాత భాస్కరం పట్ల గౌరవం పెరిగిందేగాని, అతనిపట్ల నా నమ్మకం చెదిరి పోలేదు.

భాస్కరం వాళ్లు ఏమంత ఉన్నవాళ్లు కారుట. అతను చదువుకుంటూన్న రోజుల్లో సుభద్ర అనే అమ్మాయితో అతనికి పరిచయం ఉండేదిట. భూమి గుండ్రంగా తిరుగుతుందన్న,

మాటెంత నిజమో, ఆడపిల్లలతో పరిచయం ప్రేమలోకి దించడమన్నది అంత నిజమని మా శోభనాచలం అంటూండే వాడు. సుభద్రని భాస్కరం మనసారా ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని మాటా ఇచ్చాడుట. సుభద్ర ఒక పేద బడి పంతులి కూతురు. ఆ పిల్ల భాస్కరాన్ని నమ్ముకుంది.

అలాటిది కాస్తా భాస్కరం తాలూకు బలహీనత వల్ల ఆ పిల్ల జీవితంలో ఓడిపోయింది. భాస్కరం వాళ్లనాన్న గారి మాటని కాదనలేక పోయాడు. ఆయన తన బాగుకోసం, తన సుఖంకోసం చేసే ప్రయత్నాలకు తలొంచాడు. రాజీని పెళ్లి చేసుకున్నాడు. హోదాని పెంచుకున్నాడు. భవిష్యత్తుని సుఖప్రదం చేసుకున్నాడు. కానీ సుభద్ర ఆశలనీ, ఆ బడి పంతులి గౌరవాన్నీ మంటలో కలిపాడు.

ఈ విషయాలన్నీ రాజీతో మరొకళ్లూ మరొకళ్లూ చెబుతే భాస్కరాన్ని కొంతైనా శంకించడానికి అవకాశముండేది. కానీ, సాక్షాత్తూ భాస్కరమే ఇవన్నీ చెప్పాట్ట.

రాజీ అన్నది—

"ఒక మాటు చెప్పి ఊరుకుంటే నేనంత పట్టించు కునే దాన్ని కాదు. రోజూ ఆయన ప్రేమ కథచెప్పి 'నాక్కి విశ్వ కృతి ఉందా రాజీ ! నేను ద్రోహిని కదూ !' అంటూ నా చెవిదగ్గర ఇల్లు కట్టుకుని చెపుతూంటే వినేదానికి నాకెలా ఉంటుంది? నేను వారికి భార్యని. నాకు చెప్పవలసినవీ, చెప్పి నొప్పించకూడనవీ వుంటాయి. ఆ యింగితం లేదు. కేవలం నా సహనాన్నీ, నా మంచితనాన్నీ పరీక్షించాలనే ఉద్దేశ్యంతో మితిమీరి పోతూంటే నేనేమైపోతాను ? నాగురించి ఆయనేమైనా ఆలోచిస్తున్నారా ? భార్యల ముందు తన ఘనతనిలా చాటి చెప్పుకోవడం సంస్కారమా ? నిజం రావ్ ! విసిగిపోయాను."

ఇదంతా విని నేను చాలా బాధ పడ్డాను.

మనిషిలో బలహీనత ఎంత పనైనా చేస్తుంది. అతని బలహీనత రాజీ ఉద్దేశ్యంలో నేరమే కావచ్చు. తాను లోగడ చేసిన తప్పుకి జీవిత పర్యంతం దిగులు పడటం, ఎదటివారి సానుభూతి పొందడానికి ప్రయత్నించడం ఏమంత ఆశ్చర్యమైనదీ, చిత్రమైనదీ కానేకాదు.

రాజీకి ఎన్నో విధాల నచ్చ చెప్పాను. ఆమె నామాటలు వినిపించుకోలేదు. అంతలోనే విషయం మార్చి నా పెళ్ళి ప్రయత్నాల గురించి మాటాడింది. జవాబు తిన్నగా చెప్పడం ఇష్టం లేక ఇంటి కొచ్చేశాను.

రెండు నెలలు తర్వాత రాజీ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. రాజీ భాస్కరం దగ్గరికి వెళ్ళిపోయిందిట. అతనికి తీవ్రమైన జబ్బు చేసిందిట. కడుపులో ఏదో పుండు పుట్టిందని వైద్యులు నిర్ణయించారు. ఆపరేషన్ చేశారు. ఆ విషయం భాస్కరం రాజీకి వ్రాయలేదు. రాజీ మావగారు చాలా భయపడుతూ ఉత్తరం వ్రాశారుట. ఆ ఉత్తరం చదివి క్షణమైనా ఆలస్యం చెయ్యకుండా వెళ్ళి పోయిందిట.

అతనికి ఆపరేషన్ జయప్రదంగా ముగిసింది. రాజీ మనసు కుదుటపడింది. 'ఇంతజబ్బులో వుండికూడా మీరు నా కెందుకు ఉత్తరం వ్రాయలేద'ని రాజీ అడుగుతే అతను నవ్వి అన్నాట్ట 'రాజీ గారికి భక్తుడిమీద కోపం గదా మరి' అని. రాజీ రాస్తుంది. 'ఇంత మంచి మనిషిని నే నెందుకు అపార్థం చేసుకున్నానా' అని ఇప్పుడు చింతిస్తున్నాను. నన్ను దేవుడు గూడా క్షమించ లేడు.'

నవ్వు వచ్చింది నాకు.

ఆడవాళ్లందరూ ఇంతేనా? లేక మా రాజీ ఒక్కర్తేనా? తన తప్పుని తాను చెప్పుకుని కుళ్ళి పోతున్నప్పుడు అర్థంగాని అతని 'మంచితనం'— ఈ రోజున ఆపరేషన్ జరిగి స్వస్థత చేకూరిన తర్వాతగానీ అర్థం కాలేదంటే, నవ్వు రాదూ మరి. ఇందులో ఆమెకు కనిపించిన 'మంచితనం' ఏమిటో మా రాజీ కొక్కర్తికే తెలియాలి.

ఆ తర్వాత ఆమె దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరాలన్నీ నవ్యంగానే ఉన్నాయి. వాళ్లాయిన ఆమె పట్ల ఎంత అభిమానం, ఆదరణా చూపిస్తుంటారో వాళ్లాయన ఎంత చక్కగా బొమ్మలు గీస్తారో వాళ్లాయన ఎంత తియ్యగా పాడతారో వగైరాలే ఆ ఉత్తరాల తాలూకు ముఖ్య విషయాలు.

కానీ, మొన్న వచ్చిన ఉత్తరంలో—

—దూరంగా బస్సు మోత వినిపించింది. ఆత్రంగా లేచి నిలబడ్డాను. ఒళ్లు దులుపుకుని రోడ్డుమీదకు వచ్చాను. అప్పటి వరకూ నీడచాటున కూర్చుని హఠాత్తుగా ఎండలోకి వచ్చానేమొ కళ్లు తిరిగాయి, ఒళ్లు తూలినట్టయింది. సర్దుకు నిలబడి రోడ్డు చివరివైపు దృష్టి నిలిపాను. అంత దూరంలో ఎఱ్ఱటి దుమ్ము మబ్బులాగా పైకి లేచింది. ఉన్న కొద్దీ బస్సు దగ్గరవు తున్నట్టు మోత వినిపిస్తోంది. అమ్మయ్య బ్రతికేను.

బస్సు ఫర్లాంగు దూరంలో ఉందనగానే చెయ్యెత్తి నిలబడ్డాను. బస్సు వచ్చింది. జాలి లేని దానిలా నన్ను దాటనూ దాటింది. ఎండలో దిక్కు తోచక చస్తున్న నా మొహాన్ని ఇంత దుమ్ము ప్రసాదించి మరీ వెళ్ళిపోయింది.

బస్సు కనుమరుగైన తర్వాత ఏడు పొచ్చింది. బస్సు తప్పిందే అన్న బాధకి ఈ ఎండొకటి జతయ్యింది. గబగబా చెట్టు మొద

ట్లోకి వెళ్ళిపోయి నా చేతుల్లో మొహాన్ని కప్పుకుని కుళ్ళి కుళ్ళి ఏడిచాను. జీవితంలో చాలా తక్కువ మాట్లు ఏడ్చిన వాళ్ళలో నే నొకణ్ని. బాగా గుర్తుండి పోయే ఏడ్పుల్లో అదొకటి.

ప్రకృతి యావత్తూ నామీద పగబూనినట్లుంది. 'మానవాధముడిని బుగ్గి చెయ్యవలె' అన్నట్టు నాపైన విజృంభిస్తోంది. దాహం. గొంతుక ఆరిపోయింది. ఆకలి. మెలికలు తిరిగిపోతున్నాను. గట్టిగా అరవాలని ఉంది. అరిచినా అడవిలో మొరాలకించేనాథు డెవడూ ఉండడు. ఉన్నా వచ్చి ఆదుకునే సహృదయతా ఉండదు. పోతే, నాకు చాతనయ్యింది ఏడుపు. అయినా వోపికలేని తర్వాత ఏడుపుమాత్రమే మొస్తుంది నా పిచ్చిగానీ.

దిగాలుపడిపోయాను.

ఇక్కడ నా స్థితి ఇంత అధ్వాన్నంగా ఉంది. అక్కడ రాజీ ఎంత ఖంగారు పడిపోతుందోగదా. ధైర్యం చెప్పటానికి ఆత్మీయుల సాన్నిధ్యం ఎంతైనా అవసరం. రాజీ ఉత్తరం రాసి పది రోజులు గడిచాయి. ఏరోజు కారోజు నాకోసం ఎదురు చూస్తూనే ఉంటుంది పాపం. నే నెంతకీ రాకపోవడంతో నన్నే విధంగా భావించిందో ఏమో ?

పిచ్చెత్తినట్టయింది. కసిగా పళ్ళు కొరుక్కున్నాను.

మళ్ళా కారు శబ్దం వినిపించింది. ఒక నిశ్చయానికి రావడం గూడా జరిగింది. ఏం జరిగినా సరే—రోడ్డుకి అడ్డంగా నిలబడాలి. నా అవసరాన్ని చెప్పుకోవాలి. వింటారా సరేసరి. లేదూ—దౌర్జన్యం చేసైనా సరే నా కోరిక నెరవేర్చుకోవాలి. ముందు ఈ రాకాసి ఎండబారి నుంచి తప్పుకుంటేనే గాని నాకు మనశ్శాంతి లేదు.

అప్పటికే రోడ్డు మధ్యన నిలబడి ఉన్నాను. ఎండ తీక్షణంగా ఉంది. వడగాడ్పు రివ్వున వీస్తూనే ఉంది. దాహం, ఆకలి. కాళ్ళు తేలిపోతున్నాయి. కళ్ళు తిరుగుతున్నాయి. శక్తినంతా కూడగట్టుకుని అలాగే నిలబడిపోయాను.

ఒచ్చేది చిన్నకారు. వేగంగా వస్తోంది. వొచ్చేసింది. రెండు చేతులూ చాపి నిలబడ్డాను. అంతే నా వళ్ళు తూలి పోయింది. నేలమీద ఒరిగిపోయినట్టు జ్ఞాపకం.

*　　*　　*

కళ్ళు విప్పాను. మంచంమీద పడుకున్నట్టు గ్రహించగలిగాను. గభాలున లేచి కూర్చున్నాను.

"నో .... నో .... లేవకండి." అన్నా డతను.

అతనికి పాతిక సంవత్సరా లుంటాయి. మనిషి ఆజానుబాహువు. ఎత్తుకి తగ్గ శరీర సౌష్టవం తీర్చిదిద్దినట్టుంది. అతని చేతిలో తుపాకి ఉంది. తుపాకిని తుడుస్తూ కిటికీ దగ్గర కూర్చుని ఉన్నాడు.

చిన్న గదైనా చక్కగా అలంకరించి ఉన్నది. ఎక్కువ భాగం, దుప్పి కొమ్ములూ, పులి చర్మాలూ వగైరాలే ఆ గదికి అలంకారాలు. టైం మూడయ్యింది.

"పాపం .... ఆ ఎండలో ఎంతసేపట్నుంచి నిలబడి ఉన్నారో" చేతిలోని తుపాకిని గోడమీద మేకులకు తగిలిస్తూ అతనే అన్నాడు

"ముందు ఈ నిమ్మరసం తాగండి." అన్నాడు గ్లాసు నా ముందుంచుతూ.

గబగబా తాగేశాను. అతను నావైపు తృప్తిగా చూశాడు.

"నా పేరు సత్యనారాయణ. పరిచయస్థులు సత్యమని పిలుస్తారు. మీరీ ప్రాంతాలకి కొత్తవా ళ్ళనుకుంటాను."

అవు నన్నట్టు తలూపి మా వూరుపేరు చెప్పాను.

"అలాగే కనిపించారు. ఒక విధంగా నేను కృష్ణాజిల్లా వాడిననే చెప్పాలి. మా పెత్తల్లి నన్ను దత్తత చేసుకోడంతో యీ జిల్లా వాడినైపోయాను. చదువు సంధ్యలు కృష్ణా జిల్లాలోనే జరిగాయి. చదువైన తర్వాత ఉద్యోగం చేయవలసిన అవసరం లేకపోవడంతో ఈవూరొచ్చి పొలం గట్రా చూసుకోడం మొదలెట్టాను. కాలం గడవటానికి 'వేట' ని అలవాటు చేసుకున్నాను. ఈ చుట్టు పక్కల అడవులు వేటకి అనువైనవి. వేట నుంచి తిరిగొస్తూండగానే మీరు కలిశారు. ఆవేళ వేటలో చేతికి పని దొరకలేదు" అన్నాడు అతను నవ్వుతూ.

నాకు వేటగాళ్ళన్నా, వేట అన్నా మొదట్నుంచి సదభిప్రాయం లేదు. కారణం లేకుండానే అభిప్రాయాలు చెప్పడం చాలామందికి నచ్చకపోయినా ఇది మాత్రం నిజం. సాధారణంగా వేట పట్ల అభిమానం చూపేవాళ్ళకి లోకమంతా ఆ 'జంతువులే' నని నా వూహ. అది హాస్యాస్పదమైతే కావచ్చు. అయినా యీ భావం నానుంచి దూరం కాలేదు.

వేటమీద అతనికి గల మోజు నాకు భరించరానిదే నైనా, సత్యం పట్ల నాకా క్షణంలో గౌరవం కలిగింది. అతనో వేటగాడైతేనేం ? ఆ చనువూ, ఆ స్నేహం—చాలు.

"ఆ కారు .... మీదేనా ?" నిర్ధారణ చేసుకునేందుకు అడిగాను.

"అవును. గర్వం కాదనుకుంటే నేను బ్రహ్మాండంగా డ్రైవ్ చేయగలను. అంత స్పీడులో వస్తున్న కారులో, స్టీరింగు దగ్గరనే కూర్చోకపోతే మీకు గొప్ప ప్రమాదం జరిగుండేది" చివర్న నవ్వేశాడు.

"థాంక్స్" అన్నాను.

గుమ్మం దగ్గర అలికి డయ్యింది. ఒకావిడ అక్కడ తచ్చాడుతుండటం గమనించాను. అతను ఆమెను చూచి అన్నాడు.

"లోపలికి రా."

ఆమె వచ్చింది. అతని కుర్చీ పక్కన నిలబడ్డది.

"వీరు ...." అతను నన్ను ఆవిడకి పరిచయంచేసే ఉద్దేశాన్ని నా పేరు తెలీకపోవడంతో ఆ క్షణానికి ఆపుకున్నాడు.

సిగ్గుపడ్డాను. ఇంతవరకూ కనీసం నా పేరైనా చెప్పక పోడం అన్యాయమే మరి. పేరు చెప్పాను.

"కొండదేవర గుట్ట దగ్గర స్పృహతప్పి పడిపోయారు." ఆ దంపతుల సంస్కారానికి ముచ్చటపడ్డాను.

అంతలో పనిమనిషి పళ్ళూ, బిస్కట్లూ, పాలూ తీసు కొచ్చింది. అవి టీపాయ్‌మీదుంచి వెళ్లిపోయింది.

"అవి తినుకోండి" అత నన్నాడు.

సత్యం వేటగా డైతేనేం—అలని ఆదరణ ?

"అవసరమైన పనుంటేనే గాని యీ ప్రాంతాల్లోకి ఎవ్వరూ రారు. మన జిల్లావాళ్ల కిక్కడేం తోచదసలు. అన్నట్టు అడగడం మరిచాను—మీవూరు వెడుతున్నారో ...."

చెప్పాను.

"ఆ ఊ రెళ్లాలంటే బస్సు కోసరం మళ్లా మీరు కొండ దేవరగుట్ట దగ్గరికే వెళ్లాలి. మనం ఆ గుట్టకి మూడు మైళ్ల పక్కనున్నాం."

"ఈ రాత్రికి నేను వెళ్లిపోవాలి."

"ఈపక్క ప్రయాణాలు అనుకున్నంత తేలిక్కాదు, మాస్టారు. బస్సులు వా టిష్టమొచ్చినప్పు డొస్తాయి. పైగా చీకటి పడిందంటె ప్రయాణాలు తప్పనిసరిగా మానుకోవాలి. మీరీపూట కిక్కడ భోజనం చేయండి. రేపుదయం మిమ్మల్ని బస్సెక్కించే బాధ్యత నాది. సరేనా" అన్నా డతను అనున యంగా.

మరొకప్పుడైతే అలాగే ఉండిపోదును. కానీ,

"అవసరంగా వెళ్లాలి. ఉత్తరమొచ్చి పదిరోజులైంది. భాస్కరమని నా మిత్రుడు చావు బ్రతుకుల మధ్య నున్నట్టు ఉత్తరంలో ఉంది. ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. వాళ్లకి నేను చాలా కావలసిన మనిషిని ......"

ఇంకా ఏం చెప్పేవాడినో తెలీదుగాని వాళ్లిద్దర్నీ ఎవ్వరూ మాటాడకుండా గుడ్లప్పగించి నావైపు చిత్రంగా చూడటంతో మాట లాపేశాను.

క్షణంలో ఆవిడ పూర్తిగా మారిపోయింది. తలొంచే సింది. చేతుల్తో కళ్లు మూసుకుంది. వెక్కి వెక్కి ఏడు స్తోంది. అతను ఆమెను దగ్గరికి తీసుకున్నాడు.

"ఏమిటిది సుభద్రా! మరీ పసిపిల్లలా. తప్పు కదూ"!

సుభద్రా! సుభద్రా! ? నా చేతిలోని యాపిల్‌పండు ప్లేటులో ఉంచి ఆ యిద్దరి వైపూ చూస్తూండిపోయాను. అతను నా అవస్థని గమనించేడు కాబోలు—

"మరేమీ లేదు. మీరేం ఖంగారుపడకండి రావుగారూ సుభద్ర కాస్త సుస్తీ మనిషి అంతే" అన్నాడు.

ఆవిడ అతని మెడని కావిలించుకుంది. అతను ఆమెను పక్క గదిలోకి తీసుకెళ్లాడు.

నాకేం తోచకుండా ఉన్నది. దారిని పోతున్న దానయ్యని యిలా రావడమేమిటీ, వచ్చి వాళ్ల ఆతిథ్యం పొందడ మేమిటీ, పొంది వాళ్ల మనస్సు నొప్పించేలా మాటాడట మేమిటి ?

ఇంతకీ భాస్కరం ప్రియురాలు సుభద్ర, ఈ సత్యం భార్య సుభద్ర యిద్దరూ ఒక్కళ్లేనా ? ఈమాటు సత్యం నాకు నచ్చని అసలైన వేటగాడి బొమ్మ రూపంలో నా కళ్ల ముందు తచ్చాడినట్టయింది. కొంచెం భయపడ్డాను.

మరో పది నిమిషాల్లో సత్యం నా గదిలోకి రానే వచ్చాడు. నన్ను కూర్చోమని చెప్పి అన్నాడు.

"సుభద్రకి ఫిట్సు రావడం కొత్తకాదు. ఈ పల్లె టూళ్లో నేటి వైద్యు లొక రున్నారు. ఖబురంపాను. రేపుద యానికి మీ ప్రయాణం ఎటూ వాయిదా వేసుకోవలసిందే. తప్పదు. కొంచెంసేపు రెస్టు తీసుకోండి. మళ్లీ భోజనానికి పిలుస్తాను." అని చెప్పి నామాటైనా వినకుండా వెళ్లి పోయాడు.

చాలా తమాషైన సన్నివేశంలో ఇరుక్కున్నాను. ఆలో చనలతో తల వేడెక్కిపోతున్నది. తలుపుకి గడియవేసి మంచం మీద వాలిపోయి గట్టిగా కళ్లు మూసుకున్నాను.

తలుపు శబ్దమైతే కళ్లు విప్పాను. తలుపు తీశాను. నౌకరు నిలబడి ఉన్నాడు. అతని చేతిలో టవలూ సబ్బూ ఉన్నాయి. స్నానం చేయవలసిందిగా చెప్పాడు. దొడ్లోకి వెళ్లాను.

స్నానం ముగించి నా గదిలోకి వచ్చేసరికి సత్యం కుర్చీలో ఉన్నాడు. సిగరెట్టు ముట్టిస్తూ—

"సుభద్రకి మళ్లా తెలివి తప్పింది. మరో గంటలో స్పృహ వస్తుందని వైద్యుడు చెప్పాడు" అన్నాడు.

మనసులో నొచ్చుకున్నాను.

"ఆ .... అన్నట్టు మీ మిత్రుడికేం జబ్బుటా" అడిగాడు తాపీగా.

"లోగడ అతనికి కడుపులో వుండు పుట్టింది. ఆపరేషను చేసి బాగుచేశారు. మళ్లా మొన్నీ మధ్యనే అలాంటి జబ్బేదో వచ్చిందిట. హాస్పటల్లో చేర్చారుట. చాలా గాభరా చేస్తున్నట్టు ఉత్తరం వచ్చింది."

ఇక్కడ కాసేపాగి, అతని మొహంవంక పరిశీలనగా చూచి మళ్లా మొదలెట్టాను.

"నాకు భాస్కరంతో అట్టే పరిచయం లేదు. వాళ్ల అత్తవారి ఊరు మా వూరు కావడంవల్ల వాళ్లావిడ ద్వారా అతను నాకు తెలిశాడు." అన్నాను.

అతనేం మాటాడలేదు. తన నొసటిని చేత్తో రాసుకున్నాడు. మరో చేతిలో సిగరెట్టు వెలుగుతోంది. రెండు క్షణాలు నిశ్శబ్దంగా గడచిన తర్వాత వాచీ చూచుకొని అన్నాడు.

"అప్పుడే ఏడైపోయింది. మీరు భోజనానికి లేవాలి మరి."

భోజనం నా కొక్కడికే వడ్డించారు. అతను నవ్వుతూ అన్నాడు.

"సుభద్రా నేను తర్వాత భోంచేస్తాము. ముందు మీరు కానివ్వండి."

మధ్యాహ్నం పీడించిన ఆకలి యిప్పుడు లేదు. ఎలాగోలా భోజన మయ్యిం దనిపించుకున్నాను. అతను వక్కపొడి డబ్బి, సిగరెట్టు పాకెట్టు నాముందుంచి—

"అవసరమైతే పిలవండి. ఈ రాత్రికి కమ్మగా నిద్ర పోండి" అన్నాడు గది దాటుతూ.

చిత్రమైన ఆతిథ్యం !

నిద్ర పట్టడంలేదు ! ఆ యింట్లో అంతా నిశ్శబ్దంగా ఉంది. అందరూ నిద్రపోతున్నట్టున్నారు. ఏమీ తోచకపోడంతో మంచంమీంచి లేచాను. వాచీ చూసుకున్నాను. పది గంటలు. గదిలోంచి వరాండాలోకి వొచ్చాను. సత్యం కనిపించాడు. పేము కుర్చీలో తలని పైకెత్తి ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. నన్ను చూడగానే సర్దుకు కూర్చుని అడిగాడు.

"నిద్ర పట్టడంలేదులా గుంది."

"అవును."

"పాపం .... మనసంతా మీ మిత్రుడిమీద ఉండి ఉంటుంది."

ఏమిటీ పరామర్శ ?

"ఒక విషయం అడిగేదా ?" అన్నా డతను.

"అడగండి."

"మీకు సుభద్ర గురించి ఏమీ తెలీదా ?"

ఉలిక్కిపడ్డాను. ఈ రకమైన ప్రశ్న ఇంత హఠాత్తుగా అడుగుతాడని తెలీదు నాకు. వెంటనే జవాబు చెప్పలేకపోయాను.

"నిజం చెప్పాలి."

"మీరు ఏ సుభద్ర గురించి అడుగుతున్నారో అర్థం గాకుండా ఉంది."

అతను నవ్వేశాడు. తర్వాత అన్నాడు.

"నే నూహించినంత వరకూ మీకు ఇద్దరు సుభద్రలు తెలుసు. అవునా ?"

ఇలాటి మనిషికి నేనేమని చెబితే నచ్చుతుంది ?

"నిజానికి నాకే సుభద్రా తెలీదు. రాజీ చెప్పిన మీదట భాస్కరానికి ఎవరో సుభద్ర అనే అమ్మాయితో పరిచయమున్నదన్న సంగతి మినహా మరింకేమీ తెలీదు." అన్నాను.

అతను తేలిగ్గా నవ్వేడు. చూస్తుంటే యీ మనిషికి నవ్వడం 'హాబీ'లా గుంది.

"సాక్షాత్తు ఆ సుభద్రే నా భార్య ! ఇది మీరీపాటికి వూహించే ఉంటారు. అవుతే యిది నిజమా అని నన్ను అడగ సంశయించి వూరుకున్నారు. కదూ."

సత్యం మనసులు చదవగల నేర్పరి. అప్పటికీ నేనేం మాటాడలేదు.

"సుభద్ర మా మాస్టారి కూతురు. నాకు భాస్కరం బాగా తెలుసు. అతను సుభద్ర నెంత ప్రేమించిందీ, ఆ దరిమిలా అత నెవర్ని పెళ్లి చేసుకున్నదీ తెలుసు. ఆ తర్వాత మాస్టారి అనుమతిమీద సుభద్రని నేను పెళ్లి చేసుకున్నాను. నా దగ్గర అన్నీ ఉన్నాయి. భాస్కరానికిలేని ఆస్థి, హోదా, పరపతీ అన్నీ ఉన్నాయి. కానీ మాస్టారు ! నేను భాస్కరాన్ని కాదు. కాలేను" అన్నాడు బాధగా అతను.

నా మనసు చివుక్కుమంది.

ఆ తర్వాత అతనేదో మాటాడా లనుకున్నాడు గానీ మాటాడలేకపోయాడు. నా చేతిని గట్టిగా నొక్కుతూ.

"పోయి పడుకోండి ప్లీజ్." అన్నాడు.

—ఆ ఉదయం మే మిద్దరం అతని కారుమీద కొండ దేవరగుట్ట దగ్గరికి బయలుదేరాం. కానీ అతను కారుని అక్కడ ఆపలేదు. తిన్నగా తీసుకొచ్చి నిన్న నే దిగిన రైలు స్టేషను దగ్గర ఆపేడు. నా కిదేం అర్థంకాలేదు. కారు దిగుతూ అదే అడిగాను.

"మరో పావు గంటలో మీవూరికి రైలుంది. తిరిగి వెళ్లిపోండి."

"నేను వెళ్లవలసింది మావూరు కాదు. భాస్కరం వాళ్ల వూరు."

అతను నా మాట వినిపించుకోలేదు. స్టీరింగ్ దగ్గర కూర్చుని డోరు లాక్కుని అన్నాడు.

"భాస్కరం యింక లేడు మాస్టారు ! నాలుగు రోజుల క్రితమే ఈ దారుణం జరిగింది."

నా నెత్తిని పిడుగు పడినట్లయింది. ఇంకా వివరించి చెప్పవలసిన బాధ్యత అతనిది. కాని అప్పటికే అతని కారు చాలా దూరం వెళ్లిపోయింది.